పిచ్చివాడు!

శ్రీ ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

సూర్యబింబం పశ్చిమాద్రిలో సగం మునిగివుంది. ఎర్రటి కాంతులు క్రమక్రమంగా పేలవం అయిపోతున్నాయి. పాలేరు పశువుల్ని ఇంటికి తోలుకు పోతున్నాడు. దూరాన గుళ్లో గంటలు గణగణ మోగుతున్నాయి. గబగబ గుళ్ళోకి వెళ్ళాడు ఈశ్వరయ్య. గుడిచుట్టూ మూడు ప్రదక్షిణాలు చేశాడు. గర్భగుడికి వెళ్ళాడు. చేతులు కాళ్లూ తేలిపోతున్నాయి. కళ్లు గట్టిగా మూసుకుని నిలబడిపోయాడు. మనస్సు చిక్కబట్టుకుని వెనక్కు తిరిగాడు. శివ శివ అనుకుంటూ మెల్లిగా బైటకు వచ్చాడు. కాళ్ళు కదలడం లేదు. తిమ్మెర్లు ఎక్కి మొద్దుబారిపోయినట్లు అయిపోయినాయి. చైతన్యరహితంగా ముందుకు సాగాడు. కళ్లు చెదిరిపోతున్నాయి. ఒళ్ళు గంతరిస్తోంది. పట్టుపడనీయక అట్లాగే నడుస్తున్నాడు. ఇంటి ముందరకు వచ్చేటప్పటికి మనస్సు చెదిరిపోయినట్టనిపించింది. గుండె గుభేలుమంది. అటూ ఇటూ పరకాయించాడు. పెద్దగా ఆయాసపడిపోతున్నాడు. గుమ్మంలోకి అడుగు పెట్టాడు.

'గోపిగా! ముందర గదిలో ఎవరున్నారు చూడు...' అంటూ పాలు పితకబోతున్న పాలేరును మెల్లిగా పిలిచి అడిగాడు.

'చిన్నమ్మగారు...వున్నారండి!...'

'అమ్మగారు ఎక్కడున్నార్రా! .' అదుర్దాగా అడిగాడు.

'ఇక్కడ కనిపించటం లేదండి...... లోపల వున్నారేమో!'

'మెల్లిగా పోయి అమ్మగారితో నేను పిలుస్తున్నానని చెప్పి తీసుకురా!...ఉష్...చాలా మెల్లిగా ...ఎవరికీ కనిపించకూడదు...'

పాల చెంబు దభాలున క్రింద పడేశాడు పాలేరు. వణుక్కుంటూ లోపలికి వెళుతున్నాడు.

'పాలేవిరా!...' ఒక సన్నటి కంఠం, అతన్ని నిలవేసింది.

రెండు గుటకలు వేశాడు. మాట రాలేదు.

'ఏమిటి అట్లా మొద్దులాగ నిలబడిపోయినావు... మాట్లాడవేరా! అట్లా చూస్తావేమిటి!...' అంటూనే జ్యోతి వెళ్ళిపోయింది.

'అమ్మగారు...' ఇంకా ఏమీ అనటానికి తోప లేదు.

బాగా ఆయాసపడి పోతున్నాడు. లోపల్నుంచి ఉప్పెనలాగ వచ్చి పడుతున్న అమ్మగార్ని చూసి దడదడలాడి పోయాడు. ఆమెగారు పూర్తిగా దగ్గరకు వచ్చేసింది.

'అమ్మగారు...అయ్యగారు...' అంటూ వెనక్కు తిరిగాడు.

ఈశ్వరయ్య చప్పున సంజ్ఞ చేశాడు. అటు ఇటు చూసి చప్పున పరమేశ్వరి గదుమ్మం దగ్గరకు వచ్చి, నిలబడింది. కటపటాయిస్తూ ఆయన కూడా వచ్చేశాడు. భర్త మొహం చూడంగానే చెడ్డ గాభరాపడింది, ఆయన మొహం అంత భయంకరంగా వుంది.

'ఏమిటండీ!...' అన్నది ఆదుర్దాగా.

'కుమారుడు వస్తున్నాడు' అన్నాడు ఎంతో బింకంగా.

'ఎప్పుడు!...ఎట్లా! ఎవరు చెప్పారు!...' పరమేశ్వరి బిత్తరచూపులు చూస్తోంది. చేతిలో టెలిగ్రాం మళ్లీ ఒకసారి చదివాడు. 'అవును రేపే వస్తున్నాడు. ఎవ్వరికి చెప్పక. నాకేమి తోచటం లేదు. ఏం చెయ్యాలో అర్థం కావటం లేదు.' తపనపడిపోతున్నాడు.

'ఏం చెయ్యమంటారు మరి!' పరమేశ్వరి నొక్కి అడుగుతోంది.

'అదుగో ఎవరో వస్తున్నట్టున్నారు...' ఈశ్వరయ్య ఉలిక్కిపడి వెళ్లిపోయాడు.

పరమేశ్వరి స్తబ్ధురాలై పోయింది.

'ఏమిటే అమ్మా అట్లా నిలబడ్డావు?' వస్తూ వస్తూనే జ్యోతి అడిగింది.

'ఏం లేదులే!...నీపని చూసుకోరాదూ! ప్రతి దానికీను...' విసుక్కుంది.

'ఎప్పుడూ నా పనేనా చూసుకోవటం? కాస్తంత నీకు కూడా సహాయం చేద్దామని వచ్చా!'

'అమ్మతల్లి! ఎంత ప్రేమే నామీద! పాపం వచ్చావు.. ఇప్పుడేమీ అక్కర్లేదు కాని, అవసరము వచ్చినప్పుడు పిలుస్తా కాని. నీకేమున్నా పనుంటే చూసుకో...'

'నీకవసరము వచ్చినప్పుడు నాకు తీరుబడి వుండద్దూ!...'

'అక్కేపేంక వెళ్లనుంటే వెళ్ళు!...'

జ్యోతి మూతి ముడుచుకుని వెళ్లిపోయింది.

'అక్కయ్యా నీకోమాట. ఎవ్వరితో చెప్పద్దు... ఆ! ఏం లేదు అమ్మ ఏమిటోగా వుంది. నాన్నేమో చప్పున వాకిట్లోకి వెళ్ళిపోయాడు. చెప్పమంటుంటే వినుకొంటోంది. నువ్వేమను చెపుతుందేమో!' జ్యోతి అక్కయ్య చెవిల్లో మెల్లిగా ఊదింది.

'అమ్మ ఏమిటే!...' యమున తల్లి దగ్గరకు వచ్చింది.

'అది. చెప్పిందా ఏమిటే!...'

'అసలు ఏమిటే!...'

'ఏంలేదు......ఒక్క మాట. జ్యోతితో కూడా అనద్దు. రేపు కుమారుడు వస్తున్నాడుట!...'

'నిజంగానా...'

'ఉష్!' గట్టిగా మాట్లాడక. ఎవరితోనైనా అనేవు కొంపతీసి...'

'ఇప్పుడెట్లాగు?'

'ఏమో నాకేమి అర్థం కావటం లేదు...కస్తూరి ఏంచేస్తోంది. ఎక్కడుంది....'

'దొడ్లో అంట్లు తోముతోంది...'

'జాగ్రత్త! దాని చెవిన పడనీక...చాలా ఇదిగా వుండాలి.'

'రేపు వస్తే తెలీదా!'

'వచ్చిన తర్వాతకూడా తెలీకూడదు...ఏదో ఉపాయం ఆలోచించాలి...'

'ఎట్లా చేస్తావ?'

'ఇప్పుడేమీ మాట్లాడక......ఎవరో వస్తున్నట్లున్నారు!'...

'పెద్దన్నయ్య వచ్చాడే!...'

'వచ్చాడూ!...'

'అదుగో అమ్మగారు ఎదురుచూస్తోందిగా! భర్తను ఆహ్వానించి తీసుకుపోవటానికి...'

'ఛీ! ఛీ! ఎంత సిగ్గులేకపోయింది! వాడి బ్రతుకు ఒక బ్రతుకేనా! పెళ్లానికి బానిస అయిపోయాడు. ఆ మోజేమిటో అర్థంకాదు...'

'అదుగో వదిన మనవైపునే చూస్తోందే ...'

'చూస్తే ఏం చంపుతుందా...'

'మహా విషపు చూపు...'

'అవునే అమ్మ. అవును...మనం ఏంచేస్తాం చెప్పు. వాడి ఖర్మ అట్లా కాలిపోయింది. ఆ రాకాసిని పెళ్లి చేసుకున్నాడు. అనుభవిస్తున్నాడు. ఎవరి ఖర్మ వాళ్ళను భరించక తప్పేదేముంది చెప్పు...అవునుకాని వాడి విషయము ఎవరితో చెప్పక, నాన్నగారు బజారు వెళ్లారు.'

'రేపటికి ఏదో ఏర్పాటు చేస్తారు...' పరమేశ్వరి చటుక్కున వెళ్లింది. యమున అక్కడే నిలబడి ఆలోచిస్తోంది.

'కాత్యాయనీ! ఒక్క మాట......ఇది అతి రహస్యం...ఎవ్వరితో చెప్పకూడదు. రేపు కుమారుడు వస్తున్నాడు......' సరత్ ఎంతో ఉద్వేగంగా అన్నాడు.

'కుమారుడా!...!' ఆశ్చర్యంగా అన్నది కాత్యాయని.

'అవును...మా అమ్మకు తెలీకూడదు...మా నాన్నకు తెలీకూడదు...వచ్చేదాకా ఇంట్లో ఎవ్వరికీ చెప్పకూడదు. చాలా జాగ్రత్త...అతిరహస్యం...నాకేంచెయ్యాలో తోచటంలేదు, ఎవ్వరికీ తెలీకుండా వాణ్ని తీసుకురావాలి. కస్తూరికి కూడా ముందుగా చెప్పక...నాకు చాలా భయంగా వుంది. ఎక్కడ తీసుకురావటం, ఏంచెయ్యాట... అంతా అయోమయంగా వుంది...' సరత్ తెగ ఆరాటపడిపోతున్నాడు.

'చాలా జాగ్రత్తగా వుండాలి...' కాత్యాయని నివ్వెరపోయి చూస్తోంది.

తలుపుచాటున చప్పుడయినట్లయింది. చప్పున ఈ విషయం మార్చేసి, 'ఏమిటి ఇవ్వాళ బజారుకు వెళదాము!' అన్నాడు సరత్.

'మీ ఇష్టం...రమ్మంటే వస్తాను...' కాత్యాయని చిరునవ్వు మొహంతో భర్తవైపు చూసింది.

'నేనుకూడా వస్తాను వదినా!...' అంటూ జ్యోతి తారాజువ్వలాగ వచ్చిపడింది.

భార్యాభర్తలిద్దరు ఒకరిమొహం ఒకరు చూసుకుని నిర్విణ్ణులయిపోయారు. 'అన్నయ్యకు ఇష్టం లేకపోతే నేను రాన్లే!'

'నేను వద్దన్నానులే!...' సనత్ తన స్పృహలోకి వచ్చాడు. అమ్మయ్య అనుకుంది కాత్యాయని.

'అట్లాగే నువ్వుకూడా రా!...' అన్నారు ఇద్దరూను.

జ్యోతి ఇంత మొహం చేసుకుని చరచర వెళ్ళిపోయింది.

'ఇందాకటినుంచి ఎక్కడుంది!...'

ఏమో నీకూ అదే అనుమానం వేసింది!... అవుతే దాని వాలకం చూస్తే మన మాటలు విన్నట్లు కనబడటం లేదులే!...'

'నాకూ అదే ధైర్యంగా వుంది!...మరి మీరు రేపు ఏం చేస్తారు!...'

'ఇప్పుడు నన్నేమి అడగద్దు, ఏంచేస్తానో నాకే తెలీదు.. ...' సనత్ తీవ్రంగా ఆలోచించుకుంటున్నారు.

జ్యోతి, ఇస్త్రీ బట్టలు మార్చుకుని వచ్చేసింది. కస్తూరి మొహం, ఒళ్ళు అంతా నుట్టి చేసుకుని బాగా అలసిపోయి వచ్చింది తలవంచుకుని మెల్లిగా గదిలోకి వెళ్ళబోతోంది.

'వదినా...' జ్యోతి, వెనకాలే వెళ్ళి భుజం తట్టింది.

కస్తూరి త్రుళ్ళిపడింది. శరీరంలోని వణుకు ఎంతో సేపటికిగాని తగ్గలేదు 'వణికిపోతున్నావేమిటే వదినా?...'

కస్తూరి ఏమి మాట్లాడలేదు...

ఆమె చెయ్యి పట్టుకుని చరచర పెరటిలోకి తీసుకువెళ్ళింది. ఆమె తలవంచుకునే వుంది.

'వదినా! నీకో మంచివార్త చెపుతాను నాకేమి బహుమతిస్తావు...'

తలెత్తి జ్యోతివంక చూసింది.

'ఏమిటే అవతారం? శుభ్రంగా సబ్బుతో మొహం కడుక్కురా! పెట్టెలో ఇన్ని చీరెలు పెట్టుకుని ఏమిటా చీర! మార్చేశెయ్యి ... ఎవ్వరితో చెప్పద్దు... పైగా నేను చెప్పానని అసలు చెప్పద్దు... అందరూ నామీద పడతారు...రేపే...రేపే...అన్నయ్య వస్తున్నాడు!...'

'ఆ!...' కస్తూరి కళ్ళు గిర్రున తిరిగిపోయినాయి. ఒళ్ళంతా చెమటలు కారిపోతున్నాయి ఉన్నది ఉన్నట్టుగా క్రిందపడిపోయింది. జ్యోతికి గాభరా వేసింది. దకదక పెద్దవదినదగ్గరకు వెళ్ళి చెప్పింది.

'ఏమో మరి ఇందాకటినుంచి పని చేసిందిట... కళ్ళుతిరిగి క్రిందపడిపోయింది...' అంతకంటె ఒక్క మాట చెప్పటంలేదు జ్యోతి

'కాస్త మొహాన నీళ్ళుపోస్తే, అదే లేస్తుంది. దీనికింత ఆర్భాటం ఎందుకంట!...' పరమేశ్వరి సలహా ఇచ్చి వెళ్ళిపోయింది.

జ్యోతి తత్తరబిత్తర లాడిపోతోంది. స్పృహ వచ్చిన తర్వాత ఏమాటంటుందో, ఏమి చెపుతుందో అని భయపడిపోయింది. ఎటూ తోచటంలేదు. ఆ విషయం ఎవరితోనూ చెప్పటానికి వీల్లేకుండా వుంది. జ్యోతికి ఆరాటం ఎక్కువయిపోతోంది. ఎట్లాగైనా ఈ విషయము చెప్పకపోతే తనమీదికి వస్తుందేమో, చెపుతే ఎవరితో చెప్పటం. ఎట్లా చెప్పటం. విపరీతంగా మథనపడిపోతోంది. చటుక్కున ఓ ఉపాయం తట్టింది. పెద్దవదినతో చెప్పితే సరిపోతుందనుకుంది. చాటుగా పిలిచింది.

'వదినా! వదినా! ఒక్కమాట-నువ్వు ఎవ్వరితో చెప్పనని ఒట్టేస్తే, ఒక్కమాట చెపుతా! నాకు భయమేస్తోంది. తొందరగా ఒట్టెయ్యి వదినా!...' తొందర పెట్టేసేస్తోంది జ్యోతి

'ఒట్టెందుకులే చెప్పు... నేనెవ్వరితో చెప్పను గా!...'

'చిన్నవదిన ఎందుకుపడిపోయిందో తెలుసా!..' మరే!...చాలా పిరికిది. భయస్తురాలు. రాత్రేమో కలొచ్చిందిట...కలలో నేమో చిన్నన్నయ్య కనిపించాడుట... నేను వస్తున్నానని చెప్పాడుట. అయినా కలలు ఎక్కడైనా నిజమవుతాయా! ఏమో నాకు తెలీదు మరి...ఒకప్పుడు నిజమవుతాయటగా!...మరి నేనన్నాను...నాకు కలొచ్చింది...అన్నయ్య వస్తున్నట్టు అన్నాను. అసలు నాకు కల రాలేదు వదినా! వచ్చినా. అన్నయ్య వస్తున్నటు కల రానేరాలేదు. ఊరికే తమాషాకు అన్నాను. అంతే! నిజమనుకుందో ఏమో! నాకేమి అర్థంకాలేదు నేను ఆమాట అన్నానో లేదో! అమాంతం పడిపోయింది... నాకేం తెలీదు... నేనేం చెయ్యలేదు. ఈ మాట మా

అమ్మకు కాని, అక్కయ్యకు కాని తెలిసిందంటే చాలా ప్రమాదం.. నాకు భయమే మేస్తోంది వదినా!..'

మాటా పలుకూ లేకుండా నిశ్చలంగా నిలబడిపోయిన కాత్యాయిని కళ్లల్లోకి చంచలంగా చూస్తూ జ్యోతి నిలబడిపోయింది.

'ఏమిటి వదినా! అట్లా చూస్తున్నావు... నాకు భయమేస్తోంది...'

'ఏం లేదు!...కలొచ్చింది రాత్రి!...' రెండు మూడు సార్లు గుణించుకుంది. అంతే! జ్యోతికి మరింత భయమేస్తోంది. వదినతో చెపితే తన ఆదుర్దా, ఆవేశం చల్లారుతాయేమో అనుకుంటే ఇంకా కటకటం ఎక్కువయిపోయినాయి. మనస్సంతా పరిపరివిధాల పోతోంది. వెళ్ళుతున్న కాత్యాయనిని చూస్తూ అల్లాగే నిలబడి పోయింది.

'ఏమిటే అట్లా మొద్దులాగ నిలబడిపోయినావు...' పరమేశ్వరి చటుక్కున అన్నది.

'నా కేమిటో భయమేస్తోందే?...నాకేం తెలీటం లేదు...అమ్మ...నాకు భయంగా వుందే!...' తల్లిని చుట్టేసుకుంది జ్యోతి.

'చెపితే వింటావూ! ఇంటిపట్టున వుండమంటే, ఒకటే తిరుగుడు. క్షణం తీరిక వుండదు. ఎక్కడ తిరుగుతున్నావో ఏమో!......'

'అలాంటిదేమి లేదే!...'

'కాసేపు కళ్ళుమూసుకుని పడుకో. అదే తగ్గిపోతుంది. మీ పెదవదినుందిగా. వెళ్ళి అడుగు ఏం సలహా చెపుతుందో!...'

'పెదవారు మీరున్నారుగా! మీ సలహాకంటె మంచిది చెప్పగలనా!' కాత్యాయని వెంటనే అందుకుంది.

'మా అమ్మకూడా సలహా చెప్పగలదానివనే, నీ దగ్గరకు వెళ్ళమంటోంది...' యమున వ్యాఖ్యానించింది.

'నా సలహాలు విన్నవాళ్లు సుఖంగా కాపురాలు చేస్తూనే వున్నారు.'

'చూశావా అమ్మ......చూశావా!...ఏమంటుందో!...' యమున గొంతులో జీర వచ్చింది.

పరమేశ్వరి ఉగ్రరూపం దాల్చింది. ఆ సమయంలో ఏం చేసేదో, ఏమనేదో ఆమెకే తెలీదు. అయితే ఏం? వసంత్ అప్పుడే వచ్చి వున్నాడు. అక్కసంతా లోపల లోపల అణచుకుని, ఆవేశాన్ని చంపుకుని చరచర కొడుకు దగ్గరకు వచ్చింది.

'విన్నావుట్రా! నీ పెళ్లాం ఎంత మాటందో!...

'ఏమన్న దేమిటి?'

'ఏదైనా అంటుంది. నీ వత్తాసు చూసుకుని...'

ఇంక నాకు చెప్పటం ఎందుకు?...'

'అదేనా నీ సమాధానం...'

'ఇంతకంటే కావాలంటే చెప్తాను...'

'చేతకాని వాడివయిపోయావురా. ఒట్టి దద్దమ్మవయి పోయినావు ఇంత పెళ్ళానికి దాసుడవయిపోతావని అనుకోలేదు..'

'ఆ కష్టనష్టాలు నాకే కదుటే. నీ కెందుకు ఉక్రోషం...'

'నువ్వు నెత్తిన ఎక్కించుకో. ఏమన్నా చేసుకో. నా కెందుకు? యమునను అంటానికి దానికేమి హక్కుంది?'

'యమున కున్న హక్కే!'

'దానినోట్లో నాలిక వుందా! అదేమన్నా ఒకళ్లనదే మనిషా! తనతీరు అట్లా అయిపోయింది కదా అని నిత్యమూ కుళ్ళిపోతూ అది ఓమూల అఘోరిస్తూ వుంటే, నువ్వుకూడా దాన్నంటావేమిటి?'

'నే నేమన్నానని ఇప్పుడు!... మననోరు మంచిదయితే అవతలవాళ్ళ నోరుకూడా మంచిదవుతుంది!...'

'తల్లి దగ్గరేనా ఈ మాటలు...'

'ఇంట్లో దూషణేమీ లేదే!...'

'అవును అంతా భూషణేలే!...'

వసంత్ కోరచూపుచూసి చర్రున వెళ్లిపోయాడు.

'ఇక వాణ్నన్నా ప్రయోజనం ఏమీ లేదు. దానికుంది ఉన్న పొగరంతా. మగవాడు ఏదైనా అంటే మాత్రం, ఇంటికోడలు, అదేనా తీరు! ఇంతకీ నువ్వు చేశావు. ప్రతిదానికి పోనీలే పోనీలే అంటూ ఇంతవరకు తెచ్చిపెట్టావు...' యమున సాధిస్తోంది.

'నేనేం చేశానని నన్నంటావు...మాటంటే సమాధానం చెప్పటం చేతకాదు! చూశావేఅమ్మా అంటూ నాదగ్గరకు వస్తావు చీటికిమాటికి. నీకు నోట్లో నాలిక లేదు. అదన్న మాటకు సమాధానం చెప్పలేవు. అందరినోళ్లల్లోనూ నేనా పడగలం? ఈసారినుంచి

నాదగ్గరకురా చెపుతాను...' పరమేశ్వరి రౌద్రంగా కూతురివంక చూసింది.

'అందరూ వన్నవేవాళ్లే లే!...' యమున తాపీగా కూర్చుని ఏడుపు మొదలుపెట్టింది.

ఈశ్వరయ్య మెల్లిగా లోపలికి వస్తున్నాడు. ఎదురుగా సనత్ నిటారుగా కనిపించాడు, క్షణంఆగి మళ్ళీ ముందుకు అడుగువేశాడు.

'నాన్నా!...'

ఆయన చప్పున ఆగాడు, ఇద్దరూ వాకిట్లోకి వెళ్ళారు.

'...అయితే నీకు ఈ ఇంట్లో ఏమీ హక్కు లేదా! నువ్వు చెప్పింది ఏమీ సాగదా! చెప్పు, నాకు ఏదో తేల్చి చెప్పేసెయ్యి. నువ్వు పెద్దవాడివి వున్నావని, నేను ఏమీ మాట్లాడటం లేదు. నాకు ఒక్కసారి చెప్పేసెయ్య నేనేమి కల్పించుకోనని. మిగతా విషయాలన్నీ నేను చూసుకుంటా. నేను అన్నీ చక్కపెడతా! కుమారుడు చిన్నవాడు, వాడిమనస్సు ఎవ్వరూ అర్థం చేసుకోలేక పోయారు. కాస్తంత నేను అర్థం చేసుకున్నా కూడా ప్రయోజనం లేకపోయింది. నువ్వేమి మాట్లాడలేదు. మామయ్య ఎంత బాధపడివుంటాడు. ఆనాటిదృశ్యం మళ్లా కళ్లల్లోకి వస్తే, ఒళ్ళంతా ఉడికిపోతుంది. నేనుకూడా అసమర్థుణ్ణయిపోయి అందరిని దీనంగానే చూస్తూ కూర్చున్నాను. నేను ఏమీ చెయ్యలేకపోయాను. కాని ఈ నాడు నేను మళ్ళీ అట్లా కూర్చోను. నేను చేసేది చేసి తీరుతాను. అయితే నేను ఏంచేసినా నీతో ఒక్కసారిగా ముందుగా చెప్పటం అవసరమని చెప్తున్నాను. అమ్మతో ఎన్నిసార్లు చెప్పినా ఒకటే, ఆవిడ తత్వం మారదు. ఇక నువ్వు అంతేనా! లేకపోతే ఏమైనా మార్పు వచ్చిందా? నువ్వు గట్టిగా నిలబడతానంటే నేనేమీ మాట్లాడను. లేదంటే నేను నిలబడతాను. ఈ రెండేముక్కలు... నాన్నా! బాగా ఆలోచించు...ఒక్కమాట. కుమారుడు రేపు వస్తున్నాడు. అమ్మతో కూడా చెప్పద్దు'...సనత్ గంభీరంగా తండ్రి ముందు నిలబడిపోయాడు.

ఈశ్వరయ్య నిశ్చేష్టుడయి సనత్ వంక తదేక దృష్టితో చూస్తున్నాడు. ఆయనలో, సనత్ ఊహించినంత పెద్దమార్పేమి కనబడలేదు. కనీసం చలించినట్లు కూడా కనబడలేదు. ఏమిటిట్లా వున్నాడనుకుని కూడా పైకి నిబ్బరంగానే వుండిపోయాడు. తండ్రిదగ్గర్నుంచి విరకంగా సమాధానం వస్తుందో అని అదుర్దాపడుతున్న వాడల్లా, శిలావిగ్రహంలాగ నిలబడిపోయాడు సనత్.

ఈశ్వరయ్య ఏమీ మాట్లాడకుండానే వెళ్ళిపోయాడు లోపలికి. సనత్ బుర్ర గిర్రున తిరిగిపోయింది. కుమారుడు వస్తున్నాడంటేను ఏమీ మాట్లాడలేదు. తాను అంత తీవ్రంగా చెబుతుంటేను తొణకలేదు. ఎందుకు ఇంత నిబ్బరంగా వున్నాడు అని ఆశ్చర్యపోతున్నాడు. సరాసరి లోపలికి వెళ్లాడు. ఈశ్వరయ్యకు పరమేశ్వరి ఎదురుగా కనపడింది. ఆమె వంక అదోరకంగా చూశాడు. మిగతావాళ్లు ఇట్టే తప్పుకున్నారు.

'పెద్దవాడికి తెలిసింది.' అన్నాడు ఈశ్వరయ్య.

'ఎట్లా తెలిసింది?' ఆదుర్దాగా ప్రశ్నించింది.

'నువ్వు చెప్పావుటగా!...' ఈశ్వరయ్య తొణకలేదు.

'నేనా!...రామరామ! నానోటివెంబడి అప్రస్తావనే రాకపోతే, అడుగుదాం పదండి...'

'అయిపోయిన విషయాన్ని అడిగి ప్రయోజనం లేదు. ఇకముందు చెయ్యాల్సిన కర్తవ్యమేమిటో ఆలోచించాలి. అంతే!...'

'ఈ నింద నామీదేమిటి, మీరే ఆలోచించండి.'

'ఇంట్లోకి వస్తాడు. ఏం...'

'మళ్ళీ మొదలే కాదండి...మనం అన్నీ కళ్లారా చూసి మేను...ఎట్లాగంట!...'

'తప్పుతుందా మరి?...'

'తప్పుతుందంటే తప్పకే తప్పుతుంది...ఎందుకు తప్పదేమిటి?...'

'నువ్వు మాట్లాడేదేమీ నాకు అర్థం కావటం లేదు...'

'మీరు ఇంతఇదిగా మెత్తబడిపోతారని నేను ఎన్నడూ అనుకోలేదు...'

'ఇక నీతో వాగ్వివాదము పెట్టుకుంటే లాభం లేదు. నీఉద్దేశం ఏమిటో కచ్చితంగా చెప్పేసెయ్యి. తర్వాత నేను చేసేదేమిటో చేస్తాను...'

'మీరు చేసేదేమిటో చేస్తే. ఇక నేను చెప్పటం కూడా ఎందుకు మళ్ళీ!...'

'అట్లాఅయితే ఊరుకో, ఇంకా చెప్పటం కూడా ఎందుకు?...'

'సరే అట్లాగే నోరు నొక్కుకుని కూర్చుంటా లెండి...!'

'అమ్మ చిన్నవదిన కళ్లు తెరిచిందే!...' జ్యోతి చప్పున వస్తూ వస్తూ ఆగిపోయింది' తండ్రిని చూసి.

'ఏమయిందేమిటే!...' ఈశ్వరయ్య ఆశ్చర్యంగా కూతురివంక చూశాడు.

'ఏంలేదు.. ఏంలేదు.' అంటూ వెనక్కు వెనక్కు తగ్గిపోయింది. కస్తూరి కళ్లు తెరవంగానే భర్త ఎదురుగా వచ్చి నిలబడ్డట్లు అనిపించింది. కళ్ళు గట్టిగా తుడుచుకుని చూసేంది అంతా తన భ్రమ. అయితే యేం. రేపు తనభర్త వస్తున్నాడు. ఎట్లా వుంటాడో, ఆయన వస్తున్నాడంటేనే శరీరంగగజలాడిపోతోంది. ఇక నిజంగా ఆయనమూర్తి ఎదుట ప్రత్యక్షమవుతే ఉండబట్టకలేదా! విపరీతంగా ఆలోచించుకుంటోంది. ఆలోచించుకొన్నకొద్దీ, భయమేస్తోంది. అంతపిరికిగా ఉన్న సమయంలో ధైర్యం ఇవ్వగల ఔదార్యం ఎవరిలో ఉంది! అక్కయ్య చాలామంచిది. అక్కయ్యతో చెపితే, ఏమంటుందో! జ్యోతి ఎవ్వరితోనూ చెప్పవద్దన్నది. ఎట్లాగు! కస్తూరి తెగ మథనపడుతోంది. ఏదైనాగాని, తాను అక్కతో చెప్పని విషయంలేదు. ఆమె తనదగ్గర దాచినసంగతి లేదు. ఇదిమాత్రం ఎందుకు చెప్పకూడదు అనుకుంది. జ్యోతి ఏమైనా అనుకోని, నేను అక్కయ్యకు చెప్పితీరుతాను. అనే దృఢనిశ్చయంతో కాత్యాయని దగ్గరకు వెళ్లింది. కాత్యాయని కస్తూరిని చూసి క్షణంలో త్రుళ్ళిపడింది. పాపం కలలో కనిపించగానే ఇంతగా కలవరపడిపోయింది. నిజంగానే వస్తున్నాడంటేఎంత సంతోషపడుతుందో చెప్పేశేస్తాను. ఎట్లాగైనా ఏదో రకంగా తనభర్త వస్తున్నాడనే భావం కలిగింది. అది నిజమే అని చెప్పి ఆమె మనస్సు శాంతింపచేస్తాను- అని కాత్యాయని గట్టిగా అనుకుంటోంది. కస్తూరి ఒకటి రెండు అడుగులు వేసిందో లేదో, కాత్యాయని ఆప్యాయంగా 'కస్తూరి' అని పిలిచింది.

'అక్కా!...' అన్నది. గొంతులో గీరవచ్చింది. కాత్యాయని, భుజంమీద చెయ్యి వేసిదగ్గరకు తీసుకుంది.

'నిక్కల నిజమే!...' అన్నది ముక్తసరిగా కస్తూరి తలవంచుకుంది...

'నిజంగానే కస్తూరి!....నిజంగానే....మరిది రేపు వస్తున్నాడు...'అన్నది ఎంతో ఉత్సాహంగా.

కస్తూరి వంచినతల ఎత్తలేదు, ఈ వార్త విని ప్రత్యేకంగా ఏప్రశ్న వెయ్యనూలేదు. 'కస్తూరీ నిన్నే!...' మళ్ళీ పిలిచింది.

'అక్కా!...'అని తలెత్తింది.

'నిజంగానే వస్తున్నాడు. నేను అబద్ధాలు చెప్పటం లేదు. నావంక చూడు...నీకేమి భయంలేదు. మేము వున్నాంగా!...'

మొహాన చేతులు అడ్డం పెట్టుకుని కంట తడి పెట్టుకుంది కస్తూరి.

'ఎందుకు కళ్ళ నీళ్ళు? అదుగో అత్తగారు వస్తున్నారు'...కాత్యాయని ఇల్లే లోపలికి వెళ్ళిపోయింది.

'అమ్మా!...కస్తూరికిఆవిషయం తెలిసినట్లుందే!' యమున విడ్డూరంగా వచ్చి చెప్పింది.

'ఎందుకు తెలీదు...ఇంటిల్లిపాదికి తెలిసింది. చివరకు తెలిసింది మనకే!...' మీనాన్నగారు నంగనాచిలాగ నాదగ్గరకువచ్చి ఎవ్వరికీ చెప్పొద్దని చెప్పారు. ముందరే పెద్ద కుమారుడికి చెప్పివచ్చారు. వాడికి చెప్పితే ఇంకా రహస్యందాగేదేముంది? కాత్యాయనికి చెప్తాడు. అది కొత్త కస్తూరికి చెప్పి వుంటుంది. ఇంతకి జ్యోతికి ఒకత్తికి తెలీదు. అంతే. మన రహస్యాలు ఇంతేగా! దానికి తెలుస్తే, నాకు చెప్పలేదే అంటుంది. దాని చెవినకూడా వేస్తే సరిపోతుంది. ఎందుకొచ్చిన రహస్య...'పరమేశ్వరి ఎంతో ఉక్రోషంగా అన్నది.

'అక్కయ్యా!' అంటూ జ్యోతి వచ్చింది.

'ఏమిటే? అక్కయ్యకు ఏందాచిపెట్టావు చెప్పు...'అన్నది యమున.

'ఇటురా చెపుతా!...'

'రహస్యమా!'

'ఏదో ఒకటి ఇటు రారాదు...ఏం లేదు...... చిన్నన్నయ్య రేపు వస్తున్నాడుట. అమ్మకు చెప్పక. చాలా గొడవవుతుంది...'

'నీ కెవరు చెప్పారే!...'

'అదంతా నీకెందుకులే!...'

'అహా! నాకు తెలుసు. నీకెవరు చెప్పారో!...'

'తెలుస్తే అడగటం ఎందుకో!...'

'నీ తెలివి తేటలలా నాదగ్గరే మీ వదిన్ల దగ్గర చూపించు తెలుస్తుంది నీ మజా!'

'అవసరం వస్తే వాళ్ళు నాకు లెక్కా!...'!

'మాటలవనకే!...'

'నువ్వూ చూస్తావుగా!...'

'అమ్మా! జ్యోతికి కూడా తెలుసే!...'

'ఎందుకు తెలీక!...'

'వాళ్ళ ప్లాన్లు వేరే వున్నాయి. మనకు చెపుతారా చెంగుతారా! ఏమైనా గాని, ఎవరు యేమనుకున్నా సరే! నేను ఎట్లా వుండాలో అట్లా వుంటే సరిపోతుంది!...' పరమేశ్వరి ఒళ్ళంతా జలజల లాడి పోతోంది.

ఇల్లు అలంకరణంతా కాత్యాయనే పూనుకుంది. సనత్ ఇంట్లో కావలసిన ఏర్పాటన్నీ చేసి వుంచాడు. పరమేశ్వరి మొహంలో అకారణంగా హఠాత్తుగా మార్పు వచ్చినట్లు కనిపించింది. ఈశ్వరయ్య ముఖభావం గానే ఊరుకున్నాడు. జ్యోతి ఎగిరెగిరి గంతులు వేస్తోంది 'చిన్నన్నయ్య వస్తున్నాడు చిన్నన్నయ్య వస్తున్నాడు' అనుకుంటూ కస్తూరికి సగం సంతోషం; సగం భయం. ఆమెకు ఏమీ అర్థం కావటం లేదు. ఆయన వచ్చిన తర్వాత ఎట్లా మెలగాలో ఎట్లా మాట్లాడాలో, అసలు ఎట్లా చూస్తారో, యేమన్నా మార్పు వచ్చిందో లేదో_అంతా తమాషాగా ఆలోచించుకుంటోంది.

రైల్వేస్టేషనుకు సనత్ వెళ్ళాడు. ఈశ్వరయ్య లోపల అరుగుమీద పడకకుర్చీ వేసుకుని తాపీగా పడుకున్నాడు అతను పూర్తిగా అలసిపోయాడు; క్రుంగిపోయాడు. అతని మనస్సులో రకరకాల ఆలోచనలు పోతున్నాయి తీవ్రంగా వ్యసనపడుతున్నాడు. గతాన్ని గురించి ఆలోచించుకుంటు వర్తమానంలోంచి భవిష్యత్తులోకి తొంగిచూస్తున్నాడు. ఆయన వయస్సు తనని వేదాంతంలోకి దింపేసింది పూర్తిగా. ఏది ఎట్లా జరగాలో అట్లా జరిగిపోతుందిలే అనే ఒక భావానికి వచ్చేస్తున్నాడు.

అందరూ ఇంటిగుమ్మంముందు నిలబడి ఆతుర్దాగ చూస్తున్నారు. కొస్తంత వాకిట్లో చప్పుడవుతే సరి అదుగో అన్నయ్య వస్తున్నాడని జ్యోతి ఇక్కడేగంతు వేసి చెబుతోంది. ఇంటిముందు బండి ఆగనే ఆగింది. బండిలోంచి ముందరగా దిగాడు, సనత్.

'మనిల్లొచ్చింది. దిగు.' అన్నాడు సనత్.

ఈమాటలు విన్నవాళ్ళు నివ్వెరపోయారు

'అవును మనిల్లే, దిగుమరి.' బతిమాలుతున్నట్లు అంటున్నాడు సనత్.

పరమేశ్వరికి కాళ్లుచేతులు ఆడటంలేదు. బండీ దగ్గరకు పోదామంటే ధైర్యం చాలటంలేదు. అక్కడే ఉండబుద్ధి పుట్టటంలేదు. సందిగ్ధావస్థలో పడి కొట్టుకు పోతోంది. ఎట్లాగయితే గుమ్మందాటి బండి దగ్గరకు వెళ్లటానికి ఉద్యుక్తురాలయింది.

కుమారస్వామి మెల్లిగా బండీదిగి నిలువునా నిలబడిపోయాడు. నిండుసూటుమీద వున్నాడు. తలకు మఫ్లర్ చుట్టుకున్నాడు. చేతిలో సంచివుంది. కళ్లార్పకుండా అట్లాగే చూస్తున్నాడు. ఎవరివంక చూస్తున్నాడో ఎవరికీ అర్థం కావటంలేదు. ప్రక్కనే నిలబడివున్న సనత్ కు ఏటూ తోచటంలేదు.

'అబ్బాయి!' అంటూ ఆవురుమంది పరమేశ్వరి.

'అమ్మా!' అంటూ చప్పున కాళ్ల మీదపడ్డాడు కుమారస్వామి.

ఇప్పటికి గాని, ఎవరి ప్రాణాలు వాళ్లకు చేరుకోలేదు అందరి ఆవేశాలు చల్లారినట్లయినాయి, కస్తూరికి అసలు మనస్సులో మనస్సు లేదు. నిలబడింనన్నమాటే గాని చైతన్య రహితంగా వుండిపోయింది. భర్తనోటి వెంబడి ఆకాస్తమాట వినంగానే ఆమె ప్రాణాలు కుదుటపడ్డాయి. అవును. నిజమే. పూర్తిగా తగ్గిపోయి నట్లే అనుకున్నారు.

'వదినా! అక్కయ్యా!...జ్యోతి...నాన్నా! ...కస్తూరి...నా కస్తూరి నువ్విక్కడున్నావా! నాకోసం నిరీక్షిస్తూ ఊర్మిళలాగ ఇక్కడే ఉండిపోయి నావా కస్తూరి'.. అంటూ కుమారస్వామి దగ్గరగా వెళ్ళబోతున్నాడు.

'ముందర కాళ్లూ చేతులు కడుక్కోరా!...' అంటూ సనత్ చెయ్యిపట్టుకున్నాడు.

'నా ఇంట్లో నాకు మర్యాదలు అక్కరేదు. ముందర నా కస్తూరిని చూడని...నన్ను చూసి భయపడుతున్నావా! ఎంత పిచ్చిదానివి. నాకు పిచ్చి నయమయిపోయింది ఇక నీకు పట్టుకుంటున్నమాట...!' వెర్రిగ చాలసేపు నవ్వాడు కుమారస్వామి.

ఎవరికి వారు భయపడిపోయి అట్లాగే స్వస్థానాల్లో నిలబడిపోయారు. చలనం లేదు. ఆ సమయంలో కస్తూరిని ఏంచేస్తాడో అని అందరూ హడలిపోతున్నారు. కస్తూరికి ప్రాణంలేదు. చైతన్యంలేదు. మూగదయిపోయింది. స్పృహజ్ఞానం బొత్తిగా పోయింది. పెదవి కదల్చలేదు. కళ్లు తెర్వలేదు. మొహంకూడా మొద్దుబారిపోయింది.

'అమ్మా!...కస్తూరికి నిజంగ పిచ్చి ఎక్కిందే! ఈసారి ఆసుపత్రికి దీన్ని పంపించండి...నాకు బాగా నయమయిందిగని...అసలు అక్కడ ఎంత పిచ్చివాళ్ళనయినా మంచివాళ్ళనుచేసి పంపిస్తారు. గొప్ప ఆసుపత్రి. నాకు నయమయి నేను బైటపడ్డానంటే ఇంతకంటే తార్కాణం ఏంకావాలి చెప్పు..... మీరేమీ భయపడకండి. నేను ఉత్తరం ఇస్తా తీసుకుపొండి. కస్తూరిని చేర్పించి రండి. తప్పక నయమవుతుంది. అన్నయ్యా ఏమంటావు నువ్వు...'

'నిజమేరా నువ్వు చెప్పింది...'

'ఆ! అసలు విషయాన్ని నువ్వు గ్రహించావు. అమ్మా! యముడక్కయ్య ఎక్కడ!...'

'నీ ఎదురుగుండా వున్నదిగా!...'

'అవునా!... నేనూ అదే అనుకున్నానే!... అక్కయ్యా, నీ మొగుడు దగ్గర్నించి ఏమైనా ఉత్తరం వచ్చిందా!...అసలు అడుగుతున్నానే!... అవుతే నువ్వేమి అనుకోకుండా వుంటే ఒకమాట చెపుతాను...నువ్వు నమ్మవులే నాకు తెలుసు. అయినా చెపుతాను వినటంటే...మీ ఆయనకి కూడా కొంత పిచ్చివుంది. భయపడక. నయమవుతుందిలే!...అదే ఆసుపత్రి...ఏమంటే ఆ పిచ్చినవ్వు...' జ్యోతినిచూసి దభాలున అన్నాడు.

జ్యోతికి గుండె గుభేలుమన్నది.

'నీళ్లు పోసుకుందుగని రా!' పరమేశ్వరి, కుమారుని చెయ్యిపట్టుకుంది.

'అవునే అమ్మా నీళ్ళు పోసుకుని ఎన్నాళ్లయిందో! అన్నం తిని ఎన్నాళ్లయిందో!...' త్వరగా నీళ్లుపోసి అన్నంపెట్టు...'

'నెత్తిన నోరుపెట్టుకుని మొత్తుకుంటేవిన్నారూ. ఇప్పుడు ఏంచేస్తారో చెయ్యండి. ఇది నే భరించలేను.' పరమేశ్వరి భర్తనుచూసి ఆయాసపడుతోంది.

'నువ్వు భరించలేకపోతే నేనుభరిస్తాను...నువ్వు మెదలకుండా వూరుకుంటే సరిపోతుంది. అన్నీ చక్కబడిపోతాయి' ఈశ్వరయ్య తీవ్రంగా అన్నాడు.

కుమారస్వామి అన్నంముందర ఒకటే నవ్వు, గబగబ మాట్లాడేస్తున్నాడు. చివాలున లేస్తాడు. మళ్లీ చతికిలపడతాడు. ఒకతీరుగా వుండటంలేదు. అన్నీ వికటంగానే కనిపిస్తున్నాయి.

'వదినా! నువ్వు చాల అందంగా వున్నావు...' కాత్యాయనివంక గంభీరంగా చూస్తున్నాడు.

కాత్యాయిని గజగజలాడిపోయింది. తన భర్త వంక భయంగాచూసింది. ఏమీతోచక తికమకలాడిపోతోంది. కుమారస్వామి ధోరణి రెచ్చిపోతోంది. ఆపటానికి ఎవరికీ శక్యం కాకుండా వుంది. సనత్ మొహం ఎర్రబారింది. చాలా ఉద్రేకపడుతున్నాడు ఆక్షణంలో ఏమవుతుందో అని అందరూకూడా హడలిపోతున్నారు. ప్రాణాలు అరిచేతుల్లో పట్టుకుని కూర్చున్నారు.

'యముడు ఎక్కడ వచ్చింది? ఇదెందుకు మన కొంపలో...నీ మొగుడిదగ్గరకు నువ్వు లేచిపో...ఫో అవతలకు...' కుమారస్వామి చీదరించుకుంటున్నాడు

పరమేశ్వరి ఏదో అందుకోబోతుంటే, 'ఇంతకీ నువ్వుచేశావు ఇదంతా. అసలు నువ్వు కొంపలోంచి పోతే సగం పీడ విరగడయిపోతుంది.' తల్లిని ఉరిమి ఉరిమి చూస్తున్నాడు.

తల్లీ, కూతురూ ఇద్దరూ చప్పున తప్పుకున్నారే కాని, లేకపోతే చేతిలోగ్లాసు వాళ్ళ మొహాన ముద్ర వేసేదే!'

సనత్ కూడా చెడ్డ భయపడిపోయాడు, ఈశ్వరయ్యకు ఎటూ తోచటంలేదు. తానే కలగచేసుకుని, 'భోజనాలముందర ఇవన్నీ ఎందుకురా? ముందర అన్నం తిను...' అన్నాడు.

'నువ్వు నాకేమీ సలహాలు చెప్పక్కర్లా'... కస్సుమన్నాడు కుమార్.

ఒకరి మొహాలు ఒకరు చూసుకొని తలలు వంచేసుకున్నారు.

అతివంటే ఇంట్లో అంతా హడలుగా వుంది. ఎవ్వరూ ఏమీ మాట్లాడటంలేదు. దగ్గరకు రావటానికి భయంగా వుంది. ఇంట్లో సింహంవచ్చి కూర్చున్నట్లుంది. ఎవ్వరూ కూడా పెదివి కదల్చటానికి వీల్లేదు. నోరెత్తటానికి వీల్లేదు. ఎదురుమాట చెప్పటానికి ఎవ్వరూ సాహసించటంలేదు. నరికేస్తాను. చంపేస్తాను ఇవే మాటలు. మెదులు తేచాలు మీదపడి చింగేస్తాడేమోనని హడలిపోతున్నారు. ఇక పిచ్చి తగ్గిందేముంది అనుకుంటున్నారు.

'నాకు మీరందరూ కూడా రాక్షసుల్లాగ కనిపిస్తున్నారు. నిజంగ మీరు మానవులు కారు. మానవరూపంలోని రాక్షసులు...ఇది నిజం... నేను ఇవ్వాళ్టినుంచి నిజమే చెపుతాను...కాచుకోండి...' కుమారస్వామి హుంకరిస్తున్నాడు.

'ఇది సంసారుల కొంపేనా! మీ అంతరాత్మలను అడగండి. ఒక్కొక్కరే వెళ్ళి అద్దంలో మొహాలు చూసుకోండి. మీ నిజ స్వరూపాలు బైట పడతాయి. మిమ్మల్ని మీరు మోసగించుకుంటున్నారు. నన్ను మోసగించటానికి ప్రయత్నం చేస్తున్నారు. ఇదెన్నటికీ సాగదు. నేను పిచ్చివాణ్ణిగా వున్నప్పుడు మీరు మోసం చేశారు. ఇప్పుడు నేను మంచివాణ్ణయిపోయాను. ఇంకా నన్ను మోసగించలేరు. ఎవరేనా మోసగించటానికి సాహసించారా తల బద్దలు కొట్టేస్తా!...' మీదిమీదికి వస్తున్నాడు.

'కుమారా!...' ఈశ్వరయ్య ధైర్యం చేసుకుని పిలిచాడు, 'ఒకసారి ఇటురా నీతో ఓమాట చెపుతాను...'

'నాదగ్గర రహస్యాలేమీ లేవు. చెప్పేదేదో బాహాటంగా చెప్పేసెయ్య...మనమంతా నిర్మొహమాటంగా చెప్పేస్తాము. రహస్యాలు చెప్పను, రహస్యాలు వినను...'

'నాన్న పిలుస్తుంటే ఓసారి వెళ్ళరాదు!...' సనత్ అందుకున్నాడు.

'మీరందరూ నాకు శత్రువులే! ఎవ్వర్నీ నమ్మను... వదినా నువ్వు చెప్పు.'

వచ్చేది అమావాస్య. పిచ్చి బాగా ముదిరిపోతుందిట. దినికేదైనా ఏర్పాటు చెయ్యాలని ఆలోచిస్తున్నారు. కుమారస్వామి చూపులో కాని, వాక్కులో కాని తీవ్రమైన ఆందోళన, భయం కనిపిస్తున్నాయి. పట్టుకశక్యం కావటం లేదు. నోటికెంతవస్తే అంత అనేస్తున్నాడు. వేరు పనేదీ లేదు. ఎవ్వరి మాటా లెక్కపెట్టటం లేదు. ఇల్లంతా భీభత్సం చేస్తున్నాడు; వణికించేస్తున్నాడు. మిట్ట మధ్యాహ్నం మప్పొద్దు నలుగురూ సావిట్లో కూర్చున్నారు. తలుపులన్నీ బిగించేశారు. కుర్చీలో కుమారస్వామి కూర్చున్నాడు. ఉపన్యాసం చెపుతున్నాడు. నలుగురూ తప్పనిసరిగా వింటున్నారు. ఒక విషయము కాదు ఒక లోకము కాదు. ఒక తేవార, ఆగేటట్లు లేదు. ఆవాగ్ధాటి ఆ పిచ్చిలో అంత ఇదిగా వస్తుందని గామాలు అని అనుకుంటున్నారు. శరవేగంతో మాటలు దొర్లిపోతున్నాయి. ఇంత ఉపన్యాసం, సారం కూడా 'నాకు పిచ్చి తగ్గిపోయింది. ఇప్పుడు నేను మామూలు మనిషిని ఇది మీరు గుర్తించాలి' అని. అంతకంటె ఏం లేదు. అందరిచేత బలవంతంగ తనకు పిచ్చికుదిరిందని ఒప్పించాడు. ఇంతలోకే హఠాత్తుగా తలుపు చప్పుడయింది ఎవరో కొడుతున్నట్లు. అందరూ అటువైపునే చూస్తున్నారు కాని, అందరూ లేవటానికి హడలిపోతున్నారు. కుమారస్వామి తానంతట తానే లేచి తలుపు తీశాడు.

ఎదురుగా చలపతి ప్రత్యక్షమయ్యాడు కళ్ళార్పకండా ఒకరిమొహం ఒకరు క్షణంపాటు చూసుకున్నారు.

'నీకు పిచ్చి బాగా నయమయినట్టుందే బావా!..'

చలపతి వెకిలిగా నవ్వాడు.

'నాకు నయమవుతే. యేం? ఈ ఇంట్లో ఇంకా నయమవాలసినవాళ్లు బోలెడుమంది వున్నారు...'

'అవుతే ఒక్కొక్కర్నే ఆసుపత్రికి పంపించేసెయ్య' ఇంకా చూస్తావే!'

'నీకోసమే ఆగ !...'

'నాకోసమా...' పకపక నవ్వుతూ 'అయితే నీకు పిచ్చి ఇంకా తగ్గలేదన్నమాట' అన్నాడు.

'అత్తగారు!... మీరు ఎట్లా చెపితే అట్లా చేస్తా!...మీరు ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ సంతకం పెడతా !... నా పెళ్లాన్ని నాతో పంపించండి... ఇదే నారిక్వెస్టు...' చలపతి చేతులు నలుపుకుంటూ పరమేశ్వరి దగ్గిరకు వచ్చాడు.

'ఇదిగో అబ్బాయి!...' ఈశ్వరయ్య మాట అందుకున్నాడు.

'అబ్బాయి ఏమిటండీ! నేను పిల్లాణ్ణిటండి! మామగారూ, మీరుకూడా అంత చులకనగా చూస్తే. ఇక ఈ ఇంట్లో నాకు గౌరవం ఇచ్చేదెవరు?... చెప్పండి!...'

'నేను ఇస్తాను నీకు గౌరవం. ఎంత కావాలో చెప్పు...ఎంత కావాలంటే అంత ఇస్తాను. మొహమాట పడక. ఇంటి అల్లుడివి చవటలాగ వచ్చి దేబిరిస్తున్నావా! నీ పెళ్లాన్ని నువ్వు తీసుకుపోలేవూ?...' కుమారస్వామి చలపతిమీదికి వచ్చాడు.

'ఏమిటోయ్ కొడతావా!...'

'అమ్మోయి...బావ భయపడిపోయాడు... నిజంగా కొడతాననుకున్నాడు. ఒట్టి పిచ్చివాడు...'

'అందుకనే నాచేత ఆస్తంతా రాయించుకుని నన్ను వెళ్లకొట్టాలని మీ అమ్మ...అదే...మా అత్తగారి యత్నం...'

'యమునక్కాయ్!...నీ మొగుడొచ్చాడే! ఇక మాటలు మల్లే సర్దుకోవే. ఏమిటే అల్లా చూస్తావు?'

పరమేశ్వరి కూతురివంక చూస్తోంది.

'నా పెళ్ళాన్ని పంపించమంటే ఏమిటి అల్లా చూస్తారే! వారికే నన్ను ఏడిపించకండి! నేను వంటరి వాణ్ణి నన్ను త్వరగా పంపించెయ్యండి...'

'అప్పుడు పంపించేసెయ్యండి ఇంకా చూస్తారేమిటి!...'

'ఏమిటండీ ఈ ఉప్పులాయి...ఈయన ఇప్పుడెందుకు దాపరించారంట! ఇప్పుడేమిటిచేసేది? ఏమీ మాట్లాడరేమండి!...' ఈశ్వరయ్యను పురమాయిస్తోంది పరమేశ్వరి.

ఆయన మూగవాడయిపోయాడు. ఎటు అంటే ఏమి తిప్పలు వస్తుందో అని మౌనంగా ఊరుకుంటున్నాడు.

'మామయ్యా! మీరేనా చెప్పండి...నా పెళ్ళాన్ని రమ్మనమని...' చలపతి దీనాతిదీనంగా ప్రాధేయపడుతున్నాడు.

సనత్ ఎటూ మాట్లాడటంలేదు.

'నువ్వు లేస్తావా!......మెడపట్టి వాకిట్లోకి గెంటనా!...' కుమారస్వామి ఉగ్రరూపం దాల్చాడు. యమున చివాలున లేచి నిలబడింది. జ్యోతికూడా చప్పున లేచింది. పరమేశ్వరికి కాళ్లు చేతులు ఆడటం లేదు. ముగ్గురూ గబగబ లోపలికి వెళ్లిపోయారు.

'ఇప్పుడెల్లాగే అమ్మా!...ఆయన చేత అప్పుడే రాయించమంటే సరిపోయేది...నువ్వుకూడా వెళ్లిన తర్వాత రాయమంటే రాస్తాడులే!...' పరమేశ్వరి కూతుర్ని అడుగుతోంది.

'అక్కడికి వెళ్లినతర్వాత రాయటం ఒట్టికే! అయితే ఏం! ఏదో రకంగా నేను నిభాయించుకుంటానే!'

'అయితే నీకు కూడా కాపరం చెయ్యటం ఇష్టమేనా! ఆయనతో కూడా వెళతావా మరి!...'

'మరి కుమారుడేమో అల్లా అంటుంటే ఏమన్నా చేస్తాడేమోనని భయంగావుందే!...'

'ఏంచేస్తాడేమిటి!'

'ఏమో! ఆ పిచ్చిలో కొడతాడో ఏమో!...'

'తలోదనలు పూర్తికాలా? బైటకు వస్తారా, నన్ను రమ్మంటారా......' కుమారస్వామి అప్పుడే లేవబోతున్నాడు.

గభాలున ముగ్గురూ సావిట్లోకి వచ్చిపడ్డారు.

చలపతి మొహం విప్పారింది. ఆ సాయంత్రమే యమున చలపతితో వెళ్లేదాక కుమారస్వామి నిలబడలేదు; నోరు మూతపడలేదు.

ఈలోపల కేదో అనిష్టంవచ్చింది అనుకుంటోంది పరమేశ్వరి. కాత్యాయని లోపల లోపల బాగా సంతోషపడ్డది ఇంటికి ఓ పీడ విరగడయిపోయిందని. ఈయన పిచ్చికూడా ఒకందుకు మంచికే వచ్చిందిలే అని సంతోషపడుతోంది. యమున యింట్లోంచి వెళ్ళిపోయి నప్పటినుంచి జ్యోతి ఒంటరిదయిపోయినట్లుగా అనుకుంటోంది. అక్కయ్య ఇంట్లో వున్నంత వరకు జ్యోతి అదోమోస్తరుగా వుండేది. ఇప్పుడేమో అక్కయ్య అత్తవారింటికి వెళ్ళినప్పటినుంచి, జ్యోతి వదినలమీద అదోరకమైన అసూయ ఏర్పడిపోయింది. మొహం చిట్లించుకుంటోంది. వాళ్ళతో మాట్లాడాలంటేనే ఎబ్బెట్టనిపిస్తోంది. మరదలు, వదిన్ల మధ్య దూరం రోజు రోజుకు పెరిగిపోతోంది ఏమిటిల్లా మారిపోయింది అనుకుంది కాత్యాయని. కస్తూరికి అసలు ఇంట్లో విషయాలు పట్టటంలేదు తనభర్త ఇల్లా ఐపోయారేమా అని విచారపడుతూ కూర్చుంటుంది.

రాత్రి పది అవబోతోంది. కుమారస్వామిగది లోంచి గభాలున తలుపులుతీసి కస్తూరీ అని పిలిచాడు. కస్తూరి గుండె గుభేలుమన్నది.

'నీతో మాట్లాడాలి. రా...' అన్నాడు

పై ప్రాణాలు పైనే ఎగిరిపోయినాయి. ఒక మూల సిగ్గు బిడియం, భయం ఏంచెయ్యాలో తోచటంలేదు. అట్లాగే నిలబడిపోయింది. చలనంలేదు. ఎవరికి వారు నిద్రపోతున్నారు. ఈ అర్ధరాత్రి కస్తూరిని ఏంచేస్తాడో అని హడలిపోతున్నారు.

'దానివంట్లో బాగాలేదు. నిద్రపోనీ!...' అన్నాడు ఈశ్వరయ్య.

'ఏం రోగం వచ్చింది...నాకు తెలీదా!...' అంటూ దగ్గరగా వచ్చాడు కస్తూరి చేతిని గట్టిగా పట్టుకుని గదిలోకి తీసుకుపోయాడు.

ఇవ్వాళ రాత్రి ఏదో ఘోరం జరుగుతుందని అందరూ అనుకుంటున్నా కూడా ఎవ్వరూకూడా ఏమీ చెయ్యలేక చిత్తరువుల్లాగ వుండిపోయారు

'ఏమండీ మీరన్నా ఆపండి'...కాత్యాయని భర్తను బతిమాలింది. సనత్ కు ధైర్యం చాలలేదు. తలుపులు ఫెడేలుమని వేశాడు.

అమ్మయ్య ఒక పీడ విరగడయిపోతుందిలే-అని పరమేశ్వర పెద్ద నిట్టూర్పు విడిచింది.

'అమ్మా నాకెందుకో భయమేస్తోందే!.....' జ్యోతికి కళ్ళల్లో నీళ్లు వచ్చినాయి.

'నువ్వెందుకు ఏడుస్తావే పిచ్చిదానా! ఎవరి కర్మ వాళ్ళనుభవిస్తారు' పరమేశ్వరి ఓదడించింది.

చాలా సేపటిదాక నిద్రలుపోకుండా ఎవరికి వారు గదిలో ఏం గలాభా అవుతుందో అని నిరీక్షిస్తూ కూర్చున్నారు.

'కస్తూరీ...నీకు చాలా అన్యాయం చేశాను. నిజమే! ఈ కొంపలో ఉండలేకపోయాను...వీళ్ళందరూ నాకు శత్రువులులాగానే కనిపించారు...నిజంగానే ఆనాడు నాకు పిచ్చిఎత్తింది. ఈ పిచ్చి నా శరీరంలోని లోపంచేత కాదు నా మనస్సు ఇదయి కాదు ఈ కొంపలోని ఆగం చూడలేక నిజంగా పిచ్చి ఎత్తినమాట నిజమే! కనుకనే నేను నిలవదొక్కుకోలేకపోయాను. నేను ఇవన్నీ భరించలేకపోయాను. మతి చలించినట్లయింది. నిజంగా పిచ్చిఅని ఆసుపత్రిలో పారేశారు. నాకు పిచ్చిలేదని అక్కడ చెపితే అందరూ నవ్వుతారు. ఎవ్వరూ నమ్మరు. ఎందుచేతనో ఆ పేరు రానేవచ్చింది. ఈ విధంతోనైనా ఇంటిని చక్క పెడదామని నేను ప్రయత్నం చేస్తున్నాను....ఒకటి సఫలమయింది. ఇక రెండోది చూడాలి. ఇక్కడ పాతుకుకూర్చున్న యమునను అత్తారింటికి పంపించేశాను. నేను ఈ వేషం వెయ్యకపోతే యమున ఈ జీవితంలో కాపరం చేసేది కాదు. చెయ్యనిచ్చే వాళ్ళుకారు. ఇంకా రెండున్నాయి నేను పిచ్చివాడులాగానే నటిస్తాను. మాట్లాడతాను. ఏమైనా వికృతంగా పనులుచేసినా గాభరాపడక. తెలిసిందా? ఈ విషయము ఇంకోళ్ళకు తెలీకూడదు. జాగ్రత్త...ఏమాత్రం పైకి పొక్కినా అన్నీ చెడిపోతాయి. నిన్ను చూస్తుంటే నాకు చెడ జాలేస్తోంది. అపుడే ఏం చెయ్యను చెప్పు. నిన్ను ఇంకా భరుపెట్టదలుచుకోలేదు. నేను వచ్చినప్పటి నుంచి చెపుదామనుకున్నా కూడా. సమయం రాక ఊరుకున్నాను. నీకేవిధమైన భయం లేదు. అర్ధమయిందా?' కస్తూరిని గటిగా హృదయానికి హత్తుకున్నాడు.

అప్పటికిగాని కస్తూరికి ఒక విధంగా ధైర్యం రాలేదు. తనను విడిచిపెట్టి, తనభర్త వెళ్ళిపోయినప్పుడు ఆమె మనస్సు ఏ విధంగావుందో ఊహించటం కష్టం. మొద్దుబారిపోయింది. నోటమాట లేదు. కళ్ళనీళ్ళు లేవు ఏమీ! తాను కాపరానికి వచ్చింది వచ్చిన కొద్దిరోజులకే ఇంట్లో పరిస్థితులు అర్ధమయిపోయినాయి. తనవాళ్లని ఎవర్నికూడా అనుకోవటానికి వీల్లేకుండాపోయింది. కాత్యాయనితోమాత్రం ఏమన్నా రెండుమాటలు మాటాడితే అంతే! అంతకంటె ఎవరితోను మాట్లాడేదికాదు. ఆ ఇంట్లో ప్రతివాళ్లకు అసంతృప్తి వుంది. కారణాలు ఏమిటో తెలియవు. ప్రతివారు తమ తమ మనస్సుల్లో తీవ్రమైన ఆందోళన పడుతూనే వుంటారు. అదంతా తనమీద చూపించేవాళ్లు. తానుమాత్రం ఏం చేసింది. ఎవరిని నిందించింది. ఎవరి మార్గానికి తాను అడ్డం వచ్చింది. ఏం లేదు. కాని ఎందుచేతనో కాని ప్రతివాళ్లూ తనను చులకనగా చూసేవాళ్లు. కారణం ఏమిటా అని ఆలోచించుకుంది. ఏంలేదు. తనభర్త అందర్ని మెప్పించాలనే వుద్దేశంతో ఎవరిని నొప్పించకుండా ప్రయత్నంచేస్తూ రావటమే. దాంతో బాగా అలుసు ఎక్కువయిపోయింది. తన భర్తను ఆ యింట్లో ఎవరూ కూడా మనిషిగా పరిగణించేవాళ్లే కాదు. ఇక తనకు గౌరవం ఏముంటుంది! ఏమీ అనటానికి వీల్లేదు. వీళ్లిద్దర్నీ చూసి నలుగురూ అసూయపడటమే! నిత్యము ఈసడింపులే! పొగుపుమాపులే! సూటిపోటి మాటలే! ఇవన్నీ భరిస్తూ వుండటమే తనపని. తన భర్తలో ఒక్కనాడు తీవ్రంగా మార్పు వచ్చేసింది. నలుగురూ ఉండగానే పెద్ద పెట్టున అరిచాడు. నలుగురూ హడలిపోయారు. అప్పటినుంచి అతని తీరే పూర్తిగా మారిపోయింది. తనకు పిచ్చిలేదు అని చెపుతూనే వున్నాడు. అయితేమాత్రం ఏం! అంతా పిచ్చివానిలాగానే మాట్లాడటం మొదలుపెట్టె! తన భర్తకు పిచ్చి ఎత్తిందనే మాట వినటంతోనే తన గుండె ఆగినంత పనయింది అంతే. చప్పున మొద్దుబారిపోయింది. తన హృదయానికి పెద్ద దెబ్బతగిలింది. తన భర్తను ఆసుపత్రిలో చేర్పించటం, తర్వాత ఇంట్లో వినరాని మాటలు వినటం అంతా అయోమయంగా వుంది. ప్రాణాలతో వున్నదన్నమాటే గాని చైతన్యరహిత అయిపోయింది. ఎవరు ఏమన్నా, ఎవరు ఏం చేసినా, తాను బాధపడేదిలేదు; సంతోషించేది లేదు. తాను ఇట్లా అయిపోయినా నేమిటి అని తానే ఆశ్చర్య పడింది. ఏమిటో అర్ధంకాదు పైకి చెప్పలేని వ్యథ మూగబాధ. తన భర్త మనస్సు అతి సున్నితము. అందరి

బాధలు తన బాధలే అనుకుంటాడు. ఎవరైనా కష్టపడుతుంటే చూసి ఓర్చుకోలేడు. అంత నాజూకు హృదయం. ఈ ఇంట్లో కర్కశాన్ని చూసి తట్టుకోలేకపోతాడు. ఒకమూల యమున ఇక్కడే ఉండిపోయి, తన భర్తను నానామాటలు అనటం, జ్యోతి తన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తూ నలుగురిచేత మాటలు అనిపించుకోవటం, ఈశ్వరయ్య చేతికి ఒక్క పైసా అందనీకపోవటం. డబ్బడిగితే నానా మాటలు అనటం. దీనికి తగ్గట్టు అత్తగారు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం, సనత్ తెస్తున్న డబ్బు ఇంట్లో సరిపోకపోవటం, కుమారస్వామేమో ఇంకా సంపాదనలోకి దిగకపోవటం మహాఘోరంగా పరిణమించింది. అది నరకంగా తయారయింది. ఒకరినిమరొకరు అర్థంచేసుకోకపోగా, ఒకరి ప్రవర్తనను ఒకరు విపరీతార్థాలు తీస్తూ వ్యాఖ్యానించటం. ఇంట్లో శాంతిలేకుండా చేసిపారేశారు నలుగురూ కలిసి. అయితే కుమారస్వామికి అంత నిబ్బరమైన మనస్సు లేదు. తెల్లారిలేస్తే ప్రతిదానికి చికాకుపడుతున్నాడు. ప్రతిదానికి కల్పించుకుంటున్నాడు. ప్రతివాళ్లను సంతోషపెట్టడానికి, తనకోర్కెలన్నీ ఉపసంహరించుకుంటున్నాడు. ఏం చేసినా, ఎంత ఇచ్చినా, ఇంకా తీసుకోవాలనే తాపత్రయం కాని అంతకంటె వేరే లేదు. తన ప్రవర్తనను సానుభూతితో ఆలోచించేవాళ్ళెవ్వరూ లేరు. తన మూలాన కస్తూరి తీవ్రమైన కష్టాలకు, బాధలకు గురికావలసివచ్చింది. అదికూడా తానే మానసికంగా బాధపడవలసివచ్చింది. రానురాను హృదయం దుర్బలం అయిపోయింది. మనస్సు చలించింది. అంతకంటె ఏం లేదు. 'అమ్మో! ఈ కొంపలో నేనుండలేను' అని పెద్దపెట్టున కేకపెట్టటం. తర్వాత క్రమంగా జరిగిపోయిన విషయాలన్నీ ఒక్కొక్కటే జ్ఞాపకం తెచ్చుకుంటోంది. కస్తూరికి అంతా ఆశ్చర్యంగావుంది. తనభర్తను ఆనాడు పిచ్చివాడని నలుగురూకలిసి తీసుకుపోయినప్పుడు తనకేమీ తెలీలేదు. మళ్ళీ తానుకూడా యీ ప్రపంచంలో ఒక మనిషిలాగ సంచరిస్తానని అనుకోలేదు. మళ్ళీ యీనాడు భర్త యింటికి వచ్చినతర్వాత అతని ప్రవర్తన చూసినతర్వాత కూడా, నిజంగా పిచ్చనే భావించింది కాని, ఈమాదిరి అని ఎట్లా అనుకోగలదు. తన భర్త అసలువిషయం చెప్పేశాడు. అప్పటి మనిషి కాదు. పూర్తిగా మారిపోయాడు. తనకు నిబ్బరమైన మనస్సుంది. తాను మెత్తగావుంటే ఏం లాభంలేదని గ్రహించినట్లున్నాడు. ఈ మివతో ఈ ఇల్లు చక్కబడితే అంతకంటె కావలసిందేముంది!—అనుకుంటోంది కస్తూరి

తలుపులు ఫెడేలుమని తెరుచుకున్నాయి. భయంకరంగా కుమారస్వామి గదిలోంచి బైటకువస్తున్నాడు. మంచం దగ్గరగా ముద్దయి కూర్చుంది కస్తూరి. కాత్యాయని గబగబ. కస్తూరిదగ్గరకు వెళ్ళబోయింది అతను కోరచూపు చూశాడు చప్పున వెనక్కు తగ్గింది.

'నాన్నా,...నీ దగ్గర డబ్బెంతుంది...చెప్పు?' నిలవేశాడు. ఈశ్వరయ్య గుడ్లు అప్పచెప్పి నిలబడిపోయాడు.

'పొద్దున్నే డబ్బుసంగతెందుకురా...మొహం కడుక్కోపోయి...' పరమేశ్వరి కాస్తంత సనువు చేసుకుంది.

'ఎవరైనా అడ్డం వచ్చారంటే నే!...నా ఒళ్లు నాకు తెలీదు. ముందరే చెపుతున్నా...' హూంకరించాడు.

'అట్లా నుంచుంటారేమిటండి! ఓ మూల మీద మీదకు వస్తుంటేను. పారిపొండి...' కేక పెట్టింది పరమేశ్వరి.

'నే పరుగెత్తలేననుకున్నావా?'

'నామాట విను. ముందర మొహం కడుక్కో.' సనత్ మెల్లిగా కుమారస్వామి చెయ్యి పట్టుకున్నాడు.

చేతిని గట్టిగా విదిలించాడు. ఆ విదిలింపుకు సనత్ రెండు చుట్లు గిర్రున తిరిగాడు.

ఈశ్వరయ్య చాలా భయపడిపోయాడు.

'ఇదిగో తళంచెవులు తీసుకో' అంటూ గిరాటు పెట్టాడు.

జ్యోతి గుండెమీద చెయ్యి వేసుకుని నివ్వెరపోతూ చూస్తోంది.

'నువ్వు సంపాదించిందేమీ లేదు...అంతా మా తాత ఇచ్చి పోయిందే! అనుభవించటానికి నాకూ హక్కుంది. ఇక ఒక్క పైసా నీకు దక్కనీను...! అన్నయ్యా నీకెంత డబ్బు కావాలంటే అంత ఇస్తా.' సనత్ వైపు తిరిగాడు.

సనత్ తలవంచుకుని నిలబడ్డాడు.

'వదినా! నీకే, మరి, మంచిచీర కొనిపెడతా!' కాత్యాయని దగ్గరకు ఒకడుగు వేశాడు.

పిచ్చివాడు!

వీడెలాంటి అఘాయిత్యం చేస్తాడో ఏమో-అని భయపడిపోతోంది పరమేశ్వరి. సనత్ ఒట్టి పిచ్చివాడు. తెల్లవన్నీ పాలనుకుంటాడు. వీడికెట్లా నచ్చచెప్పటం. అమ్మో! కాత్యాయని కూడా సామాన్యురాలు కాదు. ఈ కొంపమీదికి ఏం తెచ్చి పెడుతుందో!—అనుకుంటోంది.

డబ్బుతీసి విచ్చలవిడిగా ఖర్చు పెట్టేస్తున్నాడు. ఆ! అనేవాళ్ళు ఎవ్వరూ లేకపోయారు. గారాబం చేస్తూ, తండ్రి దగ్గిర చీటికి మాటికి డబ్బుపుచ్చుకునే జ్యోతికి పెద్దసంకటం వచ్చిపడింది.

చీటికి మాటికి కాత్యాయనిమీద ఎక్కడలేని ఆప్యాయత, ప్రేమ చూపిస్తున్నాడు కుమారస్వామి. సనత్, కాత్యాయనిమధ్య పోకపులు సాగినాయి. కాత్యాయని నిత్యమూ తీవ్రంగా బాధపడుతోంది. కస్తూరి చూడబోతే తనభర్త ఇట్లా ఉన్నాడుకదా అని కించిత్ కూడా ఏమీ బాధపడుతున్నట్లు కనబడటం లేదు. మరిది ఇట్లా అయిపోయాడే అని కాత్యాయని మాత్రం తీవ్రంగానే బాధపడుతోంది. అక్కయ్య తాపత్రయం, బాధ, ఆవేదన, చూసూ చూస్తూ, కస్తూరి ఉండబట్టలేక పోతోంది. ఎట్లాగైనాపోనీ అక్కయ్యతో చెప్పితే సంతోషిస్తుంది. ఎవ్వరితోనూ చెప్పదులే!-అనుకుంటోంది. ఒకమూల భర్తేమో గట్టిగా చెప్పనే చెప్పేశాడు. ఎవ్వరితోనూకూడా ఈ విషయం చెప్పకూడదని. పోనీ అక్కయ్యతో చెపుతానని వారితో అంటే! అమ్మో! ఇంకేమన్నా వుందా! వద్దనిఅంటే ఎందుకు ఈ మనసు? అక్కయ్య చాలా మంచిది. ఎవ్వరితోనూ చెప్పదు. తన మనస్సులోనే పెట్టుకుంటుంది. నా మీద అంతప్రేమ ఆప్యాయతలు చూపిస్తున్న అక్కయ్య క్షణ క్షణం అట్లా ఇదయిపోతూంటే చూసూ ఊరుకోవటం భావ్యంకాదు అనే నిర్ణయానికి వచ్చింది కస్తూరి.

కాత్యాయని ఎంతో ఆప్యాయంగా, జాలిగా, కస్తూరిదగ్గరకువచ్చి కూర్చుంది. కస్తూరిని చూసి కళ్లనీళ్లు పెట్టుకుంది. వెంటనే ఎక్కడ చూసిపోతుందో అన్నట్టు గబగబ కళ్లు అద్దుకుంది. ఏం మాట్లాడాలో అర్థంకావటం లేదు. ఏదేదో చెపుదామనవుతే వచ్చింది కాని, ఏమి చెప్పటానికి తోచటం లేదు. ఊరికే అట్లాగే చూస్తూ కూర్చుంది.

‘అక్కయ్యా!...’ అన్నది కస్తూరి.

‘కస్తూరి...’ అంటూ గట్టిగ తనదగ్గరకు తీసుకుంది కాత్యాయని పెద్దగా ఆయాసపడుతోంది. రొప్పుతోంది. చెల్లెల్ని ఎట్లా ఓదార్చాలో అర్థంకాక సతమతమయిపోతోంది ఎట్లా ఇక వీళ్ళజీవితం అనిఆరాటపడుతోంది. ఇక మరిదికి పిచ్చి నయమయ్యేటట్లు లేదు. చూడబోతే అదివరకుకంటె బాగా ముదిరినట్లుగానే వుంది. ఇలాంటిపరిస్థితుల్లో ఎందుకు ఇంటికి తీసుకువచ్చినట్లు? అంతా అర్థరహితంగా కనిపిస్తోంది. ఇంకా ఎన్నాళ్లంటే తగ్గుముఖం పట్టేను! అంతవరకు కస్తూరి ఏమవుతుందో? రకరకాలుగా ఆలోచించుకుంటూ దుఃఖపడుతోంది కాత్యాయని.

‘అక్కయ్యా! నీతో ఒకమాటచెప్పనా’ అన్నది కస్తూరి.

కస్తూరి మొహంలో అదివరకు ఎన్నడూ తాను చూడని సంతోషం కనిపించింది.

‘ఏమిటది?’ అన్నది కాత్యాయని కళ్లు పెద్దవిచేసి.

‘ఎవ్వరితో చెప్పకూడదు, బావగారితో కూడా చెప్పకూడదు...’

‘ఊ...అట్లాగే!...’

‘అట్లాగే అంటే కాదు...నాకు కచ్చితంగా మాటివ్వాలి...’

‘చెప్పనంటున్నాగా! ఇంకెట్లా చెప్పాలి!...’

‘మీమరిదికి పిచ్చి లేదు... పిచ్చి నయమయింది. అసలు పిచ్చే లేదు...’

కస్తూరికి కూడా ఏదో అయిందని భయపడింది కాత్యాయని. విడ్డూరంగా చూస్తోంది.

‘అక్కయ్యా, నేను నిజం చెపుతున్నాను..పిచ్చివాడిలాగ నటిస్తున్నారు. అంతే! అట్లాఉంటే కాని ఈ ఇంట్లో పరిస్థితులు ఒక దరికి చేరవు అని చెప్పారు నాకు. ఎవ్వరితో ఈ విషయము చెప్పొద్దన్నారు. నీతో ఒక్కదాంతోనే చెపుతున్నాను. పైకి పొక్కిందంటే అంతా చెడిపోతుంది!’ కస్తూరి నవ్వింది.

కాత్యాయనికి అంతా అగమ్యగోచరంగా వుంది. కస్తూరి చెప్పింది నిజమా? లేక కస్తూరికి కూడా పిచ్చ ఎక్కిందా? చప్పున నిర్ధారణచేసుకోలేకపోతోంది.

‘నిజంగానా కస్తూరి!...’

‘అవును నిజమే. నాకు చెప్పారు...’

‘నాకేమీ అర్థంకావటంలేదు కస్తూరి......... నిజంగానా!...’

‘నీతో అబద్ధం చెపుతానా!... ఇంత ఇదిగా తాను వుండకపోతే వదినగారి కాపురం కుదుటపడేది కాదుట...’

'అది నిజమే!... అవుతే మంచిపని చేస్తున్నాడులే!...అమ్మయ్య! ఇప్పటికి నాకు ప్రాణం తెరిపి అయింది. నిత్యమూ నాలో నేను తగని బాధపడ్డాననుకో! మరిదిని చూస్తుంటే నాకు చెడ్డభయమేస్తోంది. ఎవరితో చెప్పేదికాదు. నీతో చెపుదామనుకుంటే మరింత పిరికిదానివయిపోతావు. అసలు నిన్ను చూస్తుంటేనే నాకు జాలేస్తుంది. ఇంతపెద్ద నాటకమే ఆడుతున్నాడు. జాగ్రత్త...' కత్యాయనికి ఇప్పటికిగాని కొంచెం శాంతించలేదు.

'ఆడపడుచు మీద నీ అఘాయిత్యం ఏమిటిరా! తరిమి తరిమి దాన్ని వెళ్ళకొట్టావు... ఇక దీనిజోలికి వస్తున్నావు......' పరమేశ్వరి ఎంతో అక్కసుగా అంటోంది.

'ఇది చేస్తున్న నాటకం ఏమన్నా తెలుసా నీకు?' కుమారస్వామి గట్టిగా గద్దించాడు.

'నాటకమా!... ఇదెక్కడి తిప్పలాయి వచ్చి పడిందంట...'

'ఏ సంబంధం తెచ్చినా నాకు అక్కర్లేదని ఇక్కడే తిష్ఠవేసి కూర్చుందామనుకుంటున్నావా! ఆ సంబంధం కవక చేసుకోనన్నావో! ఏ అర్ధరాత్రి వేళో వచ్చేసి పీక పిసికేస్తాను. దాంతో పీడ విరగడయిపోతుంది......' కుమారస్వామి జ్యోతివైపుకు గుడ్లురిమి చూశాడు.

జ్యోతికి గుండెల్లో రాయిపడ్డట్లయింది. ఈ పిచ్చిలో అన్నంతపని చెయ్యనే చేస్తాడేమో కూడా అని రాత్రిళ్లు కంటినిండా నిద్రపోనేపోవటం లేదు. కళ్లు ఓమూల భగ భగ మండిపోతున్నా కూడా మేలుకునే కూర్చుంటోంది. నిద్రపోయి ఎన్నాళ్ళయిందో అనిపిస్తోంది. రోజురోజుకు చిక్కిపోతోంది. బాగా దిగులుపడిపోయింది. అన్నం ముట్టకోవటం లేదు. పరమేశ్వరి కూతుర్ని చూసి కుమిలిపోతోంది.

'అమ్మో! నా కంఠం పిసికేస్తున్నాడే!...' అంటూ గాభాలున నిద్ర మంచంలోంచి లేచింది హఠాత్తుగా జ్యోతి.

'ఎక్కడే అమ్మా? ఎక్కడే?' అంటూ పరమేశ్వరి పరుగెత్తుకుంటూ వచ్చింది. కలొచ్చింది. కలలోనే అంత హడలిపోతే ఇంకా నిజంగా చేస్తే.

'ఈ కొంపలో నువ్వింక ఉండలేవమ్మా...పెళ్లి చేసుకుని అత్తారింటికి వెళ్లి సుఖపడు...' తెగరొప్పుతోంది పరమేశ్వరి.

'నువ్వాడింది ఆట...పాడింది పాటనా! నోరు మెదపండి, ఏంచేస్తానో!' పెద్ద కర్రతీసుకుని నిలబడ్డాడు కుమారస్వామి.

కస్తూరి గుప్పెట్లో ప్రాణాలు పెట్టుకుని గబగబ గదిలోకి పరుగెత్తింది. సనత్‌కు నిజంగా భయమేసింది. గాభరాపడ్డాడు. ఏంచెయ్యాలో తోచలేదు. ఆ కర్రతో ఎవరిని బాదుతాడో ఏమో! ఇంకా ఒక్క క్షణం వీణ్ణి ఇంట్లో ఉంచటానికి వీల్లేదు. నలుగుర్ని పోగుచేసి సంకెళ్లు వేసి మళ్ళా ఆసుపత్రికి పంపాలసిందే! తగ్గిందంటే తగ్గిందనుకున్నా, ఇలాంటి పరిస్థితుల్లో ఇంట్లో ఉండటానికి వీల్లేదు అనుకున్నాడు.

'కాత్యాయనీ...నాకేమి తోచటం లేదు. వాడికి పిచ్చిలేదు. ఇంట్లో పరిస్థితులు తట్టుకోలేక అట్లా అయిపోయాడేమో అనుకున్నా. మొన్న ఇక్కడికి వచ్చినప్పుడు కూడా సగ్గా ఉన్నట్లే అని తోచింది... ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే మహా భయంకరంగావుంది. వాడికి నిజంగా పిచ్చే! బాగ ముదిరిపోయింది కూడ. ఇక ఇలాంటి పరిస్థితుల్లో ఇంట్లో ఉంచితే చాలా ప్రమాదం. నలుగుర్ని పిలిచి ఓదార్లోకి తీసుకురావాలి.' సనత్ బయలుదేరబోయాడు.

'ఏమండీ! మిమ్మల్నే!... కాస్త ఆగండి... కాసేపు ఆగితే ఆయనే సర్దుకుంటాడు...'

'ఏమిటి సర్దుకునేది?...ఇంకొంచెం ఆలస్యం అవుతే ఎవరిబుర్ర బ్రద్దలవుతుందో...'

'అదేం కాదండి నే చెపుతున్నాగా ఆగండి...'

'జ్యోతిష్యం చెపుతున్నావా ఏమిటి?'

'నిజం చెపుతున్నానండి... ఆయ నెవ్వర్ని కొట్టడండి!...'

'నీకేమన్నా చాదస్తమా ఏమిటి ఓమూల వాడు పిచ్చెక్కి ఇలవుతుంటే?'

'..... పిచ్చి కాదండి...మరి......ఆయనకు పిచ్చిలేదండి...'

'మరి నీకు నాకూ నా పిచ్చి?'

'మీకో మాట చెపుతా ఎవ్వరికీ చెప్పకండి. చాలా రహస్యం. కుమారస్వామికి పిచ్చిలేదు. ఇంటో పరిస్థితులు చక్కపెట్టటానికిట్లా నాటకం. కస్తూరి నాకు చెప్పింది.'

"ఆ!...ఏమిటి..." సనత్ చప్పున నిలబడిపోయాడు.

'అవును నిజం. కస్తూరి చెప్పింది...ఇంత ఇదిగా వుంటేగాని ఇంట్లో పరిస్థితులు ఒక దారికిరావు కొన్నాళ్ళు ఇట్లాగే వుంటాను అని చెప్పాడు...'

చప్పున సనత్, తమ్ముడిదగ్గరకు వెళ్ళాడు. కుమార్ చేతిలో కర్రతో ఎదురుగావున్న స్తంభాన్ని గట్టిగా కొట్టాడు. జ్యోతి దద్దరిల్లి పోయింది.

'నేను పెళ్ళి చేసుకుంటా... పెళ్ళి చేసుకుంటా' అని లోపలలోపల గొణుక్కుంది.

సనత్ అట్లాగే చూస్తూ నిలబడిపోయాడు. కొంతసేపయినతర్వాత కుమారస్వామి శాంతించి లోపలకు వెళ్ళిపోయాడు. పరమేశ్వరికి ఒళ్ళు కంపరం పుట్టుకొస్తోంది. ఆ ఇంట్లో ఒక్క క్షణం ఉండటానికే బుద్ధి పుట్టడంలేదు. ముళ్ళమీద వున్నట్లుంది. ఇక జ్యోతి కూడా ఆ ఇంట్లోంచి వెళ్ళిపోయినతర్వాత, ఇంట్లో తన అన్నా శైవ్యమూ – అని దిగులుపడుతోంది. ఇంకేముంది? కోడళ్ళిద్దరూ కలిసి తనను ఏంచేస్తారో ఏమో– అని భయపడిపోతోంది.

మర్నాడు మూడు నిమిషాల్లో జ్యోతి పెళ్ళి నిశ్చయమయిపోయింది. పరమేశ్వరి కళ్ళు అప్పచెప్పి కూర్చుంది.

జ్యోతికి పెళ్ళయినప్పటినుంచి కుమారస్వామిలో ఎంతో మార్పు వచ్చినట్లనిపించింది. ఆమార్పు చూసి ఈశ్వరయ్య ఆలోచించటం మొదలుపెట్టాడు నిజంగా వీడికి పిచ్చేనా, ఇదంతా నాటకమా అని. భార్యతో ఈ విషయము చెప్పదామా వద్దా అని ఆలోచించుకుంటున్నాడు. పరమేశ్వరి కుమారుని చూసి ఆశ్చర్యపోతోంది. ఆమెలో కూడా ఏమో మార్పు వచ్చినట్టుంది.

'ఏమండీ అబ్బాయిలో ఏదో మార్పు వచ్చినట్లుగా కనిపిస్తోందండి. అదివరకున్న ఉద్ధృతం అంతా తగ్గిపోయినట్లుంది. అసలు నిజంగా పిచ్చి ఎత్తినట్లేనా? ఏమన్నా వేషం వేశాడంటారా?'

'ఏమో! నాకుకూడా అదే అనుమానంగా వుంది' ఈశ్వరయ్య ఆలోచనగా అన్నాడు. పరమేశ్వరికి రోజు రోజుకు బాగా అనుమానం ఎక్కువయింది. కస్తూరి కాత్యాయని ఇద్దరూ కూడా అత్తగారంటే ఆప్యాయంగానే ఉంటున్నారు. పరమేశ్వరి కూడా ఎంతో ఇదిగానే ఉంటున్నది.

ఏమిటి ఈమెలో ఇంత మార్పువచ్చిందేమిటని కోడళ్ళిద్దరు అనుకుంటున్నారు. ఏమైనా అన్నీ మంచికే వచ్చినాయని అనుకుంటున్నారు. సనత్ మనస్సు పూర్తిగా శాంతించింది. ఆ ఇల్లు చూడబోతే అంతా స్వర్గంగా కనిపిస్తోంది. ఈశ్వరయ్య ఆప్యాయంగా అబ్బాయి అని పిలుస్తున్నాడు. పరమేశ్వరికూడా ఎంతో ఇదిగానే వుంటూంది.

సలుకుగా సావిట్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. కుమారస్వామిమాత్రం తలుపులు వేసుకుని గదిలో కూర్చున్నాడు.

'భగవంతుని దయవలన అబ్బాయికి పిచ్చితగ్గిపోయినట్లే!' పరమేశ్వరి అన్నది.

'ఏమో ఆ ఉద్ధృతం తగ్గిపోయిందే కాని...మళ్ళా ఎట్లా వుంటుందో!' ఈశ్వరయ్య అంటున్నాడు.

'కళాకళలు...... వేళావేళలు తగ్గటమేమిటి! హెచ్చటమేమిటి!...మళ్ళీ ఎప్పుడు ముంచుకొస్తుందో తెలీదు...' సనత్ తన అపనమ్మకాన్ని సూచనగా అన్నాడు.

'నాకవుతే చాలా భయమేస్తోంది...మళ్ళీ ఏవేళప్పుడు ఎట్లా మారుతుందో అని...' కాత్యాయని బింకంగా అన్నది.

కస్తూరి పక్కకు తిరిగి పమిటితో వస్తున్న నవ్వును ఆపుకుంది. 'ఏమో ఆ దానిని అదృష్టమంటారు. ఇదంతా కస్తూరిచలవనే' పరమేశ్వరి అన్నది.

తలుపులు గభాలున తెరుచుకుని కుమారస్వామి వచ్చేస్తున్నాడు. మొహంలో చిరునవ్వులు తాండవమాడుతున్నాయి. కళ్ళు విప్పారివున్నాయి. అతి నిదానంగా వస్తున్నాడు. కస్తూరికి నవ్వాగలేదు. కాత్యాయని మరిదిని చూచి తలవంచుకుంది.

సనత్ తమ్ముని వంక చూస్తున్నాడు.

ఎవ్వరూకూడా ఏమీ మాట్లాడటంలేదు. అందరూ నివ్వెరపోయి కుమారస్వామివైపు చూస్తున్నారు.

కుమారస్వామి నిబ్బరంగా అడుగులు వేస్తూ వస్తున్నాడు. తల్లి దగ్గరకు వచ్చాడు. గభాలున తల్లి పాదాలమీద పడ్డాడు.

'అమ్మా! క్షమించు...... నువ్వే నా పిచ్చి తగ్గించావు......నన్ను మంచివాణ్ని చేశావు...నన్ను మంచివాణ్ని చేశావు' కళ్ళల్లోంచి జలజల నీళ్లు రాలాయి.

'అబ్బాయి ....' పరమేశ్వరి కుమారుని రెండుచేతులు పట్టుకుని లేవనెత్తింది.

'కుమారుకు పిచ్చి తగ్గిపోయింది! ...' వెర్రిగా కేక పెట్టింది పరమేశ్వరి.